# తాను కనకపోయినా అతడి కోసం



వంతెన మీద నిలబడి చూస్తున్నాను. దూరంగా సముద్రపు అలలు కనిపిస్తున్నాయి.

ఒక దశాబ్దం వెనక్కు వెళ్తే ఈ వంతెన లేదు. అప్పుడు నేను ఇసుక తిన్నెల మీదెక్కి సాయం సమయాల్లో ఈ సముద్రాన్నే చూస్తుండే వాడిని. ఆ అలల తాలూకు మెరుపులు... ఆ ఇసుక మీద కురిసిన వెన్నెల... విశాలమైన రావిచెట్టు... మా కోసం కట్టిన పాకలు... నులక మంచాలు... ఇవన్నీ మదిలో మెరిసిన సందర్భాలెన్నెన్నో... అంతేనా? ఈ ప్రాంతానికి చెందిన జ్ఞాపకాలు ఇంకా ఏవేవో వుండాలి.

నా కప్పుడు ఉద్యోగం లేదు. ఇంటర్ పాస య్యాక ఇంకా చదవడానికి అవకాశాలు లేక ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా ఈ పని దొరికింది. మా ఇంటి పక్కనున్న ఓ పెద్ద కంట్రాక్టర్‌గారి దగ్గర గుమాస్తా ఉద్యోగం.

సముద్రానికి ఇవతల వంతెన కడుతున్నారు. వంతెన కటువైపు రెండు మైళ్ళ దూరంలో ఓ ఊరు. అంతే దూరంలో ఇటువైపు మరో ఊరు. ఈ వంతెన వల్ల అక్కడ రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. అంతేకాదు, మురుగు నీరంతా సముద్రంలో కలుస్తుంది.

రావి చెట్టు నీడలో మేం వుండడానికి పాకలు... ఓ పాకలో సిమెంటూ, స్టీలూ వుండేవి. పగలంతా పనుల్తోనే సరిపోయేది. రోజూ ఓ నలభై మందికి పైగా పని చేసేవారు. ఆ వంతెనకు పిల్లర్స్ నిర్మించే ముందు బాగా లోతుగా బావులు భూమిలోకి దించాలి. దాంతోపాటు మట్టి పని కూడా వుండేది.

నా పని వారికి హాజరువేయడం, వారితో పని చేయిస్తుండడం, జీతాలు చెల్లించడం ఇంకా ఇతర ఖర్చులకు లెక్కలు రాయడం. అప్పుడు రోజు కూలిగా మొగవారికి రెండు రూపాయిలు, ఆడ వారికి ఓ రూపాయి, పిల్లలకు ఓ రూపాయి ఇచ్చేవారు. నాకు భోజనం పెట్టి మూట ఇరవై రూపాయిలు. కాంట్రాక్ట్ పనుల్లో అయితే, వారి మీద అజమాయిషీ అవసరం లేదు.

రెండు రూపాయిలకుగాను నేను నాలుగు రూపాయిల పని చేయించాలి. వాళ్ళేమో పని ఎగ్గొట్ట డానికి ప్రయత్నం. మండుటెండలు... సముద్రం మీద నుంచి వస్తున్న గాలి... ఆకలి కరకరలాడిం చేసేది.

ఆ అడవిలాంటి ప్రాంతంలో ఏమీ దొరకవు. మాకు అన్నంలాంటి పదార్థం... ఏ కూరగాయులు వేసినా ఒకే రుచి కలిగిన పులుసూ... మేం తెచ్చుకున్న పచ్చళ్ళు... ఇవే ఓ నలుడి చేతి నుంచి మాకు లభించేవి.

బస్ కోసం మేం రెండు మైళ్ళు నడిచి వెళ్ళాలి. అక్కడ నుంచి గంటన్నర ప్రయాణం తర్వాతగాని పట్నం రాదు. పగలంతా వారితోనే గడిచిపోయేది. బావుల్లో పూడికలు తీయడం... అందులో నుంచి మట్టి బయటకు లాగడానికి వారు పాడే పాటలు... వారి సరసాలు... వారి చిన్న చిన్న తగాదాలు ఈ సందడితో గడిచిపోయేది.

సాయంకాలానికి నేనూ, మా నలుడూ, మరో వ్యక్తి మిగిలేవాళ్ళం. అతను ఇంజన్ డ్రైవర్. మేంకాక బావుల పూడిక తీయడానికి కంట్రాక్ట్ తీసుకున్న ఓ మేస్త్రీ ఇద్దరు కూలీలు. వాళ్ళు కూడా సాయంకాలం కూలీల్తోపాటు వెళ్ళి అక్కడ తాగి ఏ రాత్రికో వచ్చేవారు.

నర సంచారం లేని ఆ ప్రాంతంలో ఎటు చూసినా సముద్రం వదిలిన ఇసుక గుట్టలు. వెన్నెల రాత్రంతా సముద్రం మీద పడి మెరుస్తుండేది. చల్లటి గాలి ఈ ప్రపంచాన్ని మధురమైన కలలా మారుస్తుండేది. రెండు మెతుకులు తినేసి సరిగెత్తు కొని వెళ్ళి ఆ ఇసుక గుట్టల మీద పడుకొని వెన్నెల్ని, చుక్కల్ని, సముద్రాన్ని చూస్తుంటే రాత్రంతా కరిగిపోయేది. అక్కడే నేను గొంతెత్తి పాడుతుంటే ఆ కంఠంలోని మెలికల్ని గాలి మతారంగా మోసు కెళ్ళేది. అక్కడ ఏదో తెలియని వింత పరిమళం వుండేది. ఆ రాత్రి సమయాల్లో దేవతలు విహరిస్తు న్నట్టుగా అనుభూతి.

ఏ క్షణమూ అక్కడున్నందుకు దిగులు లేదు. ఎవరో వచ్చి దోచుకుంటారనే భయం లేదు. ఒక్క భవిష్యత్ గురించే ఎప్పుడైనా ఆలోచన...

అవును... ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది—

ఆమే... సుబ్బారావు అక్క... —

చిన్నతనంలోనే పెళ్ళి చేస్తే భర్త చనిపోతే, నితంతువుగా మిగిలి నలభై సంవత్సరాలకే శరీరం ముడతలు పడి, పళ్ళు ఊడిపోయి, మాసిపోయిన చీరతో ఖాళీకొచ్చే ఆమె!

ఆ రోజు అందరికీ పనులు పుర మాయించి పాకలోకొచ్చి పడుకుంటే బయట ఎవరో తచ్చాడుతున్నట్లని పించి —

"ఎవరు?" అన్నాను.

సమాధానం లేదు.

నేనే లేచి వెళ్ళాను. ఆమె తల వంచుకొని నిలబడి వుంది.

"ఏమిటిలా వచ్చావ్?" అన్నాను.

నా చేతిలో ఓ పొట్లాం వుంచి వెళ్ళిపోయింది. ఆశ్చర్యంగా తెరిచి చూశాను.

పూస మిఠాయి!

## వీరత్వం

సైనికులందరూ యుద్ధంలో తమ గొప్పతనాలు కమాండర్‌కు వివరిస్తున్నారు.

ఓ సైనికుడు అన్నాడు — "నేను శత్రు సైనికుని కాళ్ళు నరికేశాను."

"కాళ్ళు ఎందుకు? తల నరక్కపోయావా?" కమాండర్ అడిగాడు.

"తల ముందుగానే నరకబడి వుంది."

— కె.రాజ్యలక్ష్మి






ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 5-1-90




# తల్లడిల్లిన ఆ మాతృ హృదయ నిర్వేదం

ఎంత లేదన్నా పావలా వేస్తుంది. ఆమె రోజంతా మట్టి ఎత్తిపోస్తే లభించే రూపాయి నుంచి నా కోసం పావలా ఖర్చు చేయడం... అప్రయత్నంగా కొద్దిగా తుంచినోట్లో వేసుకున్నాను. ఎంత మధురంగా వుందో!

రెండు రోజులకోసారయినా నాకు ఆ పొట్లాం తెచ్చి ఇస్తుండేది.

రెండు మూడు సార్లు వద్దని నేను కోపంగా చెప్పాను. అయినా మానలేదు.

కోపి నోటితో నవ్వేది. కొద్ది రోజుల్లోనే కూలీలు ఆమెకు నన్ను చూపించి "మీ అబ్బాయొచ్చాడుగో" అనేవారు.

వెంటనే సిగ్గుతో తలవంచుకునేది.

"సుబ్బారావు అక్కంటూ పిలుస్తున్నారు. అలా వుంటుందిగాని దాని పేరు మీద అరెకరం దాని తదనంతరం మీకే రాసిస్తుంది" అనేవారు. ఆమె పేరు కూడా ఎవరూ పిలవరు. సుబ్బారావు అక్కే. తను ఎంతో అమాయకురాలు తనకు కొద్దిపాటి జ్ఞానం లభించేనాటికే ఆమె నితంతువు. నన్ను చూడగానే ఆమెలో ఒక్కసారిగా మార్పు వచ్చేది. ఆడకూలీల్తో అరుస్తుంటే 'అదుగో మీ అబ్బాయి' అంటే ఒక్కసారిగా ఆగిపోయేది.

సాయంకాలం ఇసుక తిన్నెల మీద పడుకొన్నప్పుడు మా అమ్మతోపాటు ఈమె కూడా గుర్తొచ్చేది..

కొందరి జీవితాలు అంతే అనుకుంటాను. ఆ జీవితాల్లో చీకటి తప్పించి వెన్నెలే వుండదు. ఆమెను చూస్తే నాకు జాలి మాత్రం కలిగేది. ఆమె ఓ పిచ్చితల్లిలా వుండేది. ఆ కళ్ళు ఎక్కడో లోతుల్లో వుండేవి. ఆమె మరే అనుభూతికన్నా మాతృత్వపు అనుభూతికి దూరమైంది. ఆమె ఇలా తయారు కావడానికి అదే కారణమనుకుంటాను.

కాని, నా కెందుకో ఆమె మీద జాలి మించి కలగలేదు. ఆమెలో ఓ దురదృష్టవంతురాలైన స్త్రీనే చూసేవాడిని. ఇప్పుడు నా కనిపిస్తోంది... ఆమె నాలో దేన్నో వెతుక్కునేదని... ఆమెకు నన్ను దగ్గరగా తీసుకొని గుండెల కదుముకోవాలని వుండేదనుకుంటాను... కానీ ఇద్దరికీ ఏదో అడ్డువచ్చింది!

ఓ రోజు నన్ను వెంటనే బయలుదేరి రమ్మని కబురు. నా సంచిలో బట్టలు సర్దుకొని బయలుదేరుతున్నప్పుడు అదే చివరిసారని తెలియదు. వెంటనే బస్ కోసం నడిచి వెళ్ళాను. ఆ రోజంతకో ఆమె రాలేదు. బస్ బయలుదేరుతుండగా నా కెందుకో ఆమె గుర్తొచ్చింది!

ఆ తర్వాత నా జీవితంలో ఎన్నో మార్పులు. మంచి ఉద్యోగం...

పెళ్ళి... పిల్లలు... నా కంటూ కలిసిన జీవితం... దాంతోపాటు జీవితం యాంత్రికమై పోయింది. అయినా...

ఆ ఇసుక తిన్నెలూ... ఆ సముద్రపు హోరూ... బంగారపు వెన్నెలా... పదే పదే గుర్తొస్తుండేవి.

ఓసారి ఎక్కడో మా 'నలుడు' కనపడినప్పుడు చెప్పాడు మీ గురించి 'సుబ్బారావు అక్క' అడుగుతోందని. నేను మిఠాయి పొట్లాం గుర్తొచ్చి నవ్వుకున్నాను.

"ఆమె బాగుందా?" అన్నాను.

"బాగానే వుందిలెండి" అన్నాడు.

సరిగ్గా పది సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ నడుమ నా కలల్లో ఎవరో పిలుస్తున్న భావన... ఓ తల్లిని హస్తం మృదువుగా నా బుగ్గలు నిమిరినట్టు... ఎక్కడి నుంచో నీటి అలల మీద బంగారపు వెలుగులు ప్రసరిస్తున్నట్టు... ఏదో పాట వినిపిస్తున్నట్టు వుంది.

అందుకే వచ్చేశాను.

ఎంత మారిపోయింది! ఆ రావి చెట్టు లేదు. ఆ ఇసుక తిన్నెలు లేవు. మేం తవ్విన నేల మీద నిర్మించిన పిల్లర్స్ మీద వంతెన. మారంది ఆ సముద్రమే.

వంతెన మీద నిలబడి చూస్తుంటే సముద్రపు అలలు కనిపిస్తున్నాయి. చల్లటి గాలి నన్ను తాకుతూంది... నా కనిపిస్తోంది... నన్ను ఇక్కడికి రప్పించింది ఇవే కాదు... బహుశా... ఆమె... ఆమె అయుంటుంది!

ఇంకా ఆమె బతికుందా? బతికున్నా నన్ను గుర్తుపెట్టుకుంటుందా? ఆమెలో నేను అమ్మను చూడలేకపోయిందెందుకు? ఎందువల్ల ఆమెను ఇన్ని సంవత్సరాలుగా మరిచిపోయాను?

నాలో ఏదో నేరం చేసిన భావన—

నేను వెంటనే ఆమెను చూడాలి.

వంతెన మీద నుంచి నేను నాకు తెలియకుండానే పరుగెత్తాను. ఇప్పుడు రోడ్లులాంటివున్నా అన్నీ గోతులే... అయినా సరే ఆ రోడ్డు మీద పరుగెత్తుతున్నాను. దూరంగా ఎవరివో ఇళ్ళు కనిపిస్తున్నాయి. వచ్చేశాను.

ఎవరో యువకుడు అటుగా వెళ్తున్నాడు.

"బాబూ నీకు సుబ్బారావు ఇల్లు తెలుసా?" అన్నాను.

"ఏ సుబ్బారావు?"

ఏ సుబ్బారావని చెప్పాలి?

"అదే బాబు... ఆయనకు ఓ అక్క వుండేది. వాళ్ళంతా వంతెన పనులకు వచ్చేవారు."

ఆ కుర్రాడు నాకేసి పరిశీలనగా చూశాడు.

"మీ రెవరు?"

"నేనక్కడ పనులు చేయించేవాడ్ని."

"రండి వెళ్దాం" అన్నాడు.

నేను అనుసరిస్తున్నాను.

"ఇప్పుడు గుర్తొస్తోంది - మీరు గుర్తొస్తున్నారు. అప్పట్లో నేను కూడా పనికి వస్తుండేవాడ్ని" అంటున్నాడు.

"అలాగా!" అన్నాను.

"ఇంతకూ సుబ్బారావు అక్క బతికుందా?" అని అడగాలనుకున్నాను.




ఓ ఆసుపత్రిలో బోర్డుమీద ఇలా వుంది-
"మీరు తాగే సిగరెట్ల మూలంగా మీ గుండెకు పడుతున్న చిల్లుల గురించి మీకు కంగారు లేకపోయినా మా ఆస్పత్రి కార్పెట్‌కు పడే చిల్లుల గురించి మాకు చాలా బెంగగా వుంది. కనుక దయచేసి సిగరెట్లు కాల్చకండి."

—పద్మశ్రీ, మాణిక్యారం

5-1-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

అప్పటికే ఆ కుర్రాడు పరుగెత్తుకెళ్ళి "మావయ్యా" అని అరిచాడు.

"ఎవరూ?" అంటూ వచ్చాడు.

సుబ్బారావే. పెద్దగా మార్పు రాలేదు.

"గుర్తుపట్టావా?" అన్నాడా కుర్రాడు.

"ఆ... బాబు కదూ" అన్నాడు సంతోషంగా.

"అవును... మీ అక్క... అదే అమ్మ ఎక్కడుంది?" అన్నాను.

"అదా... ఇవాళో, రేపో అన్నట్టుంది. రండి" అంటూ ఓ పాక దగ్గరికి తీసుకెళ్ళాడు.

కుక్కిమంచంలో పడుకొని వుంది.

జుట్టంతా తెల్లబడిపోయింది.

"ఓసేవ్ అప్పా... ఎవరొచ్చారో చూడు... బాబొచ్చాడే" చెవి దగ్గర అరుస్తున్నాడు సుబ్బారావు.

ఆ గుంటకళ్ళలో ఎక్కడో కదలిక... ఆమె పెదవులు విచ్చుకున్నాయి.

నేను మంచం మీద కూర్చుని ఆమె చేతులు పట్టుకున్నాను.

ఎందుకో ఆమె సిగ్గుపడినట్లనిపించింది.

నాకేసి విందుగా చూసుకొంది. ఏదో చెప్పాలని ప్రయత్నం చేస్తోంది. సుబ్బారావుకేసి తిరిగింది.

"ఏమిటే?" అన్నాడు.

అతికష్టం మీద దిండుకేసి చూపించింది.

## ఆటోగ్రాఫ్ ఫోటోగ్రాఫ్

'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని అభిమానంగా, ఆత్మీయంగా ప్రకటించిన శ్రీ దాశరథి కృష్ణమాచార్య నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుశిక్షను అనుభవించారు. రుద్రవీణ, అగ్నిధార వంటి కావ్యాలనూ, ఉర్దూ నుంచి ఎన్నో పద్యానువాదాలనూ, 'యాత్రా స్మృతి' పేరుతో ఆటో బయోగ్రఫీని రచించారు.

ఇటీవలే మృతి చెందిన దాశరథి 'మహాకవి' గౌరవం అందుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్థాన కవి పదవిని కూడా అలంకరించారు.



సేకరణ:
ద్వా.నా. శాస్త్రి

"దీని కెప్పుడూ ఇదే గొడవ" అన్నాడు సుబ్బారావు.

వణుకుతున్న చేతుల్తో నాకు అందించింది.

ఆ కంటి కొసల నుంచి ఓ నీటి బొట్టు ముడతలు పడ్డ శరీరాన్ని తడుపుతోంది.

అది సంతోషమో, దుఃఖమో నాకు తెలియదు.

ఆమె చేతిని నేను విడవలేదు.

ఎందుకో నా కేసి చూస్తున్న ఆమె కళ్ళు జీవం కోల్పోయినట్లనిపించింది!

నేను పొట్లాం విప్పాను —

ఫ్లాస్ మిఠాయి.

అమ్మ హృదయంలా వుంది. ■




# రతిని తీసుకెళ్ళి మీ భార్యామణిని ఆశ్చర్యచకితురాలిని చేయండి.



లేకపోతే క్లియోపాత్రాని. పోతే మరింకా సిండెరెల్లాని. దేనినైనా సరే.




## శ్రీపెట్ వార్షికోత్సవ బహుమానపు ఆహ్వానం.

ఇప్పుడు మీ వంటింటి ఆత్మీయమైన - రతి, సిండెరెల్లా, క్లియోపాత్రాలు ప్రత్యేకమైన ఉచిత బహుమానంతో వస్తున్నాయి. ఐదు సీసాలు కొనుక్కొంటే, మరొక సీసాను ఉచితంగా తీసుకెళ్ళవచ్చు.

మునుపెన్నడూ లేని వ్యాపారావకాశంతో మీ అర్ధాంగిని ఆనందాశ్చర్యాలతో తేలియాడించండి.

- రతి
- సిండెరెల్లా
- క్లియోపాత్రా

ఈ ఆహ్వానపు కాలం పరిమితం కనుక త్వరపడండి, మరి!



శ్రీపెట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్
(మునుపు పెట్ ఇండస్ట్రియల్ కన్స్యూమర్ ప్యాకేజ్ ప్రైవేట్ లిమిటెడ్‌గా వ్యవహరించబడేది)
4, రేడి దేశికాచారి రోడ్డు,
మద్రాసు-600 004.

ADWAVE/SIPL/3921 TEL